సాక్షి నిజామాబాద్

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



విరోధులైన మిత్రులు..

ఆర్మూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయానికి కృషిచేసిన ముగ్గురు మిత్రులు ప్రస్తుతం విరోధులుగా మారారు.

- IIలో ▸



ఎన్నికలు ప్రశాంతంగా..

అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /18.4

వాతావరణం

ఉదయం శీతల గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

బాన్సువాడలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి



వివరిస్తూ.. విమర్శిస్తూ..



ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సోమవారం కామారెడ్డి జిల్లాలో పర్యటించారు. జుక్కల్, బాన్సువాడలలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలలో పాల్గొన్న ఆయన.. తొమ్మిదిన్నరేళ్లలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఓవైపు సంక్షేమ పథకాలను వివరిస్తూనే.. మరోవైపు ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. సభలకు జనం భారీగా తరలిరావడం, పోచారం, సింధేలపై సీఎం కేసీఆర్ పొగడ్తల వర్షం కురిపించడంతో గులాబీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించిన సీఎం కేసీఆర్
- ప్రతిపక్షాలపై విమర్శల దాడి
- సింధే ప్రజల మనిషన్న గులాబీ దళపతి
- లక్ష్మీపుత్రుడికి లక్ష మెజారిటీ ఇవ్వాలని పిలుపు
- బాన్సువాడ, జుక్కల్ సభల సక్సెస్‌తో బీఆర్ఎస్‌లో జోష్

సాక్షి, కామారెడ్డి/బాన్సువాడ/నిజాంసాగర్: అన్ని పార్టీలకంటే ముందే అభ్యర్థులను ప్రకటించి, బీ ఫామ్‌లూ ఇచ్చిన బీఆర్ఎస్.. నియోజకవర్గాలవారీగా సభలతో ప్రచారంలోనూ ముందుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం జిల్లాలో రెండు నియోజకవర్గాలలో నిర్వహించిన సభ లలో పాల్గొన్నారు. తన ప్రసంగంతో కార్యకర్తల్లో జోష్ నింపారు. పోరాటాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లేందుకు మూడు నెలల పాటు ఆర్థిక వేత్తలతో మేధోమధనం చేశామని సీఎం పేర్కొన్నారు. ఎన్నో ఆలోచనలు చేసి రూపొందించిన పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేసి దేశానికి దిక్సూచిగా నిలిచామన్నారు. మన దగ్గర ఉన్న పథకాలు ప్రధానమంత్రి మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లోనూ లేవన్న విషయాన్ని గుర్తించాలని ప్రజలను కోరారు. ఇప్పటికే మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటల విద్యుత్, తాగునీరు, పంట రుణాల మాఫీ, రైతు బంధు, రైతు బీమా వంటి సంక్షేమ కార్యక్రమాలతో దేశంలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పేదల దుఃఖం తీరిందని, వ్యవసాయంలో లక్ష్మీ తాండవిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై సీఎం కేసీఆర్ విరుచుకుపడ్డారు. ఆ పార్టీ చేసిన ద్రోహం వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆలస్యమైందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఎక్కడా 24 గంటల కరెంటు ఇవ్వడం లేదన్నారు. పొరపాటున కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే నిండా ముంచుతారన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, ఇంకా ప్రజల అవసరాలను తీర్చే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.



ఎంపీ, ఎమ్మెల్యేలు సౌమ్యులు..

వెనుకబడిన ప్రాంతమైన జుక్కల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన స్థానిక ఎమ్మెల్యే హన్మంత్ సింధే నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్నాడని సీఎం కేసీఆర్ అభినందించారు. తన దగ్గరకు ఎప్పుడు వచ్చినా వెనుకబడిన ప్రాంతమంటూ నిధులు తీసుకువెళ్లడమే తప్ప సొంత పనుల గురించి ఎప్పుడూ అడగలేదన్నారు. ఎన్నికల తర్వాత వచ్చి లెండి ప్రాజెక్టు గురించి మహారాష్ట్ర వాళ్లను పిలిచి మాట్లాడతానని, నాగమడుగుతో నలభై వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. గతంలో సింగూరు నీళ్లు రాకుంటే ఇబ్బంది ఉండేదని, ఇప్పుడు దాని అవసరం లేకుండానే నిజాంసాగర్ నిండుకుండలా ఉండే పరిస్థితి వచ్చిందన్నారు. జుక్కల్ ప్రాంతానికి అప్పట్లో పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు వచ్చేవారు కాదన్నారు. తెలంగాణ వచ్చాక అభివృద్ధి జరిగి పరిస్థితి మారిందన్నారు. గతంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎవరో తెలిసేది కాదని, మనం అధికారంలోకి వచ్చాక నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతానికి చెందిన ఎంపీ బీబీ పాటిల్ కేంద్రంతో కొట్లాడి ఎన్నో రోడ్లు సాధించాడన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఇద్దరూ సౌమ్యులని సీఎం అభినందించారు.



సింధేను పరిచయం చేస్తున్న సీఎం కేసీఆర్

పదేళ్లలోనే ఎంతో అభివృద్ధి..

నిజాంసాగర్: సీఎం కేసీఆర్ కృషితో 60 ఏళ్లలో జరగని అభివృద్ధి పదేళ్లలోనే జరిగిందని జుక్కల్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే పేర్కొన్నారు. సోమవారం జుక్కల్ చౌరస్తా వద్ద నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో రూ. 5,500 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ. 1,500 కోట్లతో రోడ్లు, వంతెనలు నిర్మించామన్నారు. నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మూడు మండలాల్లో 30 పడకల ఆస్పత్రులతో పాటు బిచ్కుందలో 100 పడకల ఆస్పత్రి నిర్మించామన్నారు. పిట్లంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టులు, కౌలాస్ కోటలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని సీఎంను కోరారు.

రెట్టింపు సేవలందిస్తా..



బాన్సువాడ: బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధితో నిండుకుండలా మారిందని, మరోసారి అవకాశం ఇస్తే రెట్టింపు అభివృద్ధి చేస్తానని స్పీకర్ పోచారం పేర్కొన్నారు. బాన్సువాడలోని వీక్లీ మార్కెట్ ఆవరణలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ తనపై ఉన్న ప్రేమతో అడిగిన వెంటనే కాదనకుండా అత్యధిక నిధులు ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో ఐదు కొత్త మండలాలు ఏర్పాటయ్యాయని, రూ. వెయ్యి కోట్లతో సాగు నీటి రంగాన్ని అభివృద్ధి చేశామన్నారు. గతంలో సింగూర్ నీళ్ల కోసం ధర్నాలు చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు నిజాంసాగర్ ప్రాజెక్టులోనే ఎప్పుడూ నీరుంటోందని పేర్కొన్నారు. 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించామని, విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేశామని వివరించారు. బాన్సువాడలో ముగ్గురు ఎమ్మెల్యేలున్నారని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారని, కానీ ఒక్క కూలికి ముగ్గురం పని చేస్తున్నామని పేర్కొన్నారు. తన కుమారులు ఆదుకునే మనసత్వం ఉన్నవారన్నారు. కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్మన్లు దఫేదార్ శోభ, దాదన్నగారి విఠల్‌రావు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఎంపీపీ నీరజావెంకట్‌రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మగోపాల్‌రెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, పోచారం రవీందర్‌రెడ్డి, అంజిరెడ్డి, బద్యానాయక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ.. బంగారువాడ..

తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత పోచారం శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో బాన్సువాడ నియోజక వర్గం ఎంతో అభివృద్ధి సాధించిందని సీఎం కేసీఆర్ అన్నారు. తన నియోజకవర్గంలో కూడా కట్టలేనన్ని ఇళ్లు పోచారం శ్రీనన్న నిర్మించి ఆదర్శంగా నిలిచాడన్నారు. బాన్సువాడ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది బంగారువాడగా మారిందన్నారు. పోచారం వ్యవసాయ మంత్రిగా ఉన్నపుడు రైతుబంధు పథకం తీసుకువచ్చి అమలు చేశామని, ఆయనను అందుకే తాను లక్ష్మీపుత్రుడు అని సంబోధిస్తానని పేర్కొన్నారు. ఇంత అభివృద్ధి చేసిన లక్ష్మీపుత్రుడిని లక్ష మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పోచారం గొప్ప హోదాలో ఉంటాడన్నారు. ముస్లిం పిల్లల చదువుల కోసం గురుకులాలు ఏర్పాటు చేశామని, జూనియర్ కాలేజీలుగా అభివృద్ధి చేశామని, భవిష్యత్తులో డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పోచారం శ్రీనన్న కోరిన కోరికలన్నీ చేసిపెడతానని, ఆయనను మాత్రం భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



బాన్సువాడ సభకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు



జుక్కల్ సభలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్యకర్తలు

న్యూస్‌రీల్

రంగంలోకి దిగిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు



డిచ్‌పల్లి : అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలో మూడు మండలాలకు ఒకటి చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరి వాహనానికి 360 డిగ్రీల కోణంలో దృశ్యాలను కవర్‌చేసే విధంగా ప్రత్యేక కెమెరాలను ఏర్పాటు చేశారు. నూతనంగా రూపొందించిన టెక్నాలజీ ద్వారా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం రికార్డు చేసిన వివరాలను ఎప్పటికప్పుడు నేరుగా ఎన్నికల కేంద్రానికి జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయానికి చేరవేస్తారు. తమకు కేటాయించిన మండలాల్లో 24 గంటల పాటు ఈ వాహనం సంచరిస్తూనే ఉంటుంది. అంతేకాకుండా వీరి వెంట అదనంగా ఒక కెమెరామెన్‌ను కూడా అందుబాటులో ఉంచారు. సోమవారం ఈ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం డిచ్‌పల్లిలో సంచరించింది.

నిన్న బీజేపీ.. నేడు బీఆర్ఎస్

- రెండు రోజుల్లోనే పార్టీ మారిన తొండాకూర్ ఎంపీటీసీ



దొంకేశ్వర్(ఆర్మూర్) : ఎన్నికల గడువు సమీపిస్తుండ డంతో ప్రజాప్రతినిధులు పార్టీలను మారుస్తున్నారు. విచిత్రమేమిటంటే మొన్నటి వరకు బీఆర్ఎస్‌తో కలిసి నడిచిన దొంకేశ్వర్ మండలం తొండాకూర్‌కు చెందిన ఎంపీటీసీ మద్దుల రాణి దంపతులు రెండు రోజుల క్రితం బీజేపీలో చేరారు. బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పైడి రాకేశ్ రెడ్డి వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఐతే, 48 గంటలు తిరగక ముందే సదరు ఎంపీటీసీ మళ్లీ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చేతుల మీదుగా బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. రోజుల వ్యవధిలోనే పార్టీలు మారడంపై మండల ప్రజలు నవ్వుకుంటున్నారు.

కిడ్నాప్ చేశారంటూ తల్లి ఆందోళన..

ఎంపీటీసీ పదవిలో ఉన్న తన కోడలు, కొడుకును ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అనుచరులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని మురళి తల్లి మద్దుల సాయమ్మ సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. కోడలు, కొడుకుని తిరిగి పంపకపోతే పురుగుల మందు తాగి చస్తానని మాట్లాడిన వీడియో వాట్సప్‌లో వైరల్ అయ్యింది. వారిని ఏం చేస్తారోనని భయంగా ఉందని వాపోయింది. ఇదిలా ఉండగా ఎంపీటీసీ భర్త మద్దుల మురళి మాట్లాడుతూ ఒక వీడియోను విడుదల చేశారు. తమను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, ఇష్టపూర్వకంగానే తిరిగి బీఆర్ఎస్‌లో చేరినట్లు వెల్లడించాడు. మా తల్లితో కొందరు వ్యక్తులు కావాలనే తప్పుడు వీడియో చేయించారని ఆరోపించారు.

ఎంపీపై హత్యాయత్నాన్ని ఖండించిన మంత్రి

వేల్పూర్ : దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్తకోట ప్రభాకర్‌రెడ్డి మీద ఎన్నికల ప్రచారం సందర్భంగా కత్తితో దాడి చేసిన ఘటనను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో హత్యారాజకీయాలకు తావులేదని, బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

పొరపాట్లు లేకుండా పోలింగ్ జరగాలి

- నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- మూడో తేదీ తర్వాత క్షేత్రస్థాయికి ఎన్నికల పరిశీలకులు
- కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేశ్ వ్యాస్



సుభాష్‌నగర్ : రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పొరపాట్లకు తావులేకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేశ్ వ్యాస్ సూచించారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ సన్నద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సోమవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేశ్ వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులతో, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోలింగ్ సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచించారు. నవంబర్ 10వ తేదీ నామిమేషన్లు దాఖలు చేసేందుకు చివరితేదీ అని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆన్‌లైన్ యాప్‌లో నామినేషన్ల వివరాలు వెంటనే నమోదు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా ఓటరు జాబితా వివరాలు అందించాలన్నారు.

నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత అవసరమైన బ్యాలెట్ పేపర్ల తయారీ, బ్యాలెట్ యూనిట్లు పోస్టల్ బ్యాలెట్స్ సిద్ధం చేసుకోవాలన్నారు. అభ్యర్థుల సమక్షంలో ఈవీఎం యంత్రాల రెండో ర్యాండమైజేషన్ చేపట్టాలని, అభ్యర్థులు అధికంగా ఉంటే సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ చేయాలన్నారు. పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఓటర్ స్లిప్పులు పంచాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, ఎన్నికల విధుల్లో ఉండే వాళ్లందరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలన్నారు.

మద్యం, నగదు రవాణాను అరికట్టాలి..

ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం పంపిణీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ ప్రతిరోజు వచ్చే అప్పీళ్లపై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. నవంబర్ 3 నుంచి ఎన్నికల పరిశీలకుల క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని, సన్నద్ధంగా ఉండాలన్నారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు యాదిరెడ్డి, చిత్రామిశ్రా, మున్సిపల్ కమిషనర్ మకరంద్, ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

నోటాకు జై..

- అభ్యర్థులను కాదని ఓటు వేసిన ఓటర్లు
- రెండు పర్యాయాల్లోనూ అభ్యర్థులపై పెరిగిన వ్యతిరేకత

జంగ్ తెలంగాణ

నిజామాబాద్ అర్బన్ : ఎన్నికల్లో తమకు నచ్చని అభ్యర్థులకు కాదని నోటాకు ఓటు వేసే విధానాన్ని గతంలో ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. 2003లో మొట్టమొదటిసారిగా ప్రయోగాత్మకంగా చత్తీస్‌గఢ్, మిజోరాం, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రవేశపెట్టారు. అనంతరం అన్ని రాష్ట్రాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో 2014 ఎన్నికల నుంచి భాగంగా ఈవీఎంలో నోటా బటన్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థులు నచ్చకపోతే నోటా నొక్కి తమ ఉద్దేశాన్ని తెలియజేయవచ్చు. దీని ప్రకారం 2018లో జరిగిన జనరల్ ఎన్నికల్లో నమోదైన నోటా ఓట్లు పెరిగాయి. రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో నోటాకు భారీగానే పడ్డాయి. అయితే ప్రతి ఎన్నికల్లోనూ నోటా ఓట్లు పెరుగుతూ వస్తున్నాయి. బాన్సువాడలో 2014లో 1,316, 2018లో 1,555 వచ్చాయి. ఆర్మూర్ నియోజకవర్గంలో 2014లో 1,445, 2018లో 1,657 పడ్డాయి. అలాగే బాల్కొండ నియోజక వర్గంలో 2014లో 1,535, 2018 ఎన్నికల్లో 1,886 పడ్డాయి.

2018లో నోటాకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	నోటా ఓట్లు	శాతం
నిజామాబాద్ అర్బన్	855	0.57
బోధన్	1,862	1.17
బాన్సువాడ	1,555	1.07
ఆర్మూర్	1,657	1.18
బాల్కొండ	1,886	1.22
నిజామాబాద్ రూరల్	2,203	1.27
కామారెడ్డి	1,471	0.91
ఎల్లారెడ్డి	2,218	1.32
జుక్కల్	1,976	1.30

క్లుప్తంగా

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. గుగులోత్ మమత, దాసరి సరయు, లకావత్ రాణి, అజ్మీర ఇందూ, సుంపాక సౌమ్యరాణి, అల్లుల్ల అనిల్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. నవంబర్ 4 నుంచి 8 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారు. వీరిని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగమోహన్ అభినందించారు. జైపాల్‌రెడ్డి, నీరజారెడ్డి పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీలకు..



నిజామాబాద్‌నాగారం: జాతీయ స్థాయి సెపక్‌తక్రా టోర్నీకి జిల్లాకు చెందిన చామకూర రిక్కిరెడ్డి, సాయి శ్రీ ఎంపికైనట్లు జిల్లా సెపక్ తక్రా కార్యదర్శి గాధరి సంజీవ్ రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సెపక్ తక్రా అధ్యక్షుడు కేశ వేణు, ఉపాధ్యక్షులు ల్యాబ్ గంగారెడ్డి, దీపిక, సతీష్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు మీసాల ప్రశాంత్ కుమార్, గణేష్, ప్రసాద్ అభినందించారు.

ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా నాగరాజు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా ఎకనామిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పాత నాగరాజు నియామకమయ్యారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి సోమవారం నాగరాజుకు నియామక ఉత్తర్వులు అందజేశారు. నాగరాజు గతంలో ఎకనామిక్స్ హెచ్‌వోడీగా, బీవోఎస్ ఛైర్మన్‌గా, అడిషనల్ కంట్రోలర్‌గా, కంట్రోలర్‌గా, సారంగపూర్ బీఈడీ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థులకు శిక్షణనిచ్చి వారిలో నైపుణ్యాలను అభివృద్ధి పరిచేలా కృషి చేయాలని రిజిస్ట్రార్ సూచించారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు



భీమ్‌గల్: ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని సీపీ కల్మేశ్వర్ అన్నారు. సోమవారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ కేంద్రం, నామినేషన్ సెంటర్లను పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి, ఎన్నికల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. అడిషనల్ డీసీపీ జయరాం, ఏఆర్ డీసీపీ గిరిధర్ రెడ్డి, ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చంద్ర, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై హరిబాబు ఉన్నారు.

గులాబీ శ్రేణుల్లో జోష్



సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సీఎంతో సెల్ఫీ దిగుతున్న యువకులు



జుక్కల్‌లో ప్రజా ఆశీర్వాద సభా వేదికపై ప్రజాప్రతినిధులు, నాయకులు

నిజాంసాగర్/పిట్లం/పెద్దకొడప్‌గల్/బిచ్కుంద/మద్నూర్: సీఎం కేసీఆర్ సభతో గులాబీ శ్రేణుల్లో జోష్ వచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సభతో సోమవారం జుక్కల్ చౌరస్తా గులాబీమయంగా మారింది. నియోజకవర్గంలోని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు సభకు తరలి వచ్చారు. సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్యాలరీల్లో కుర్చీలు కార్యకర్తలు,ప్రజలతో నిండిపోయాయి. చాలా మంది రోడ్డుపై, టెంట్ల కింద నిల్చొని సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున రావడంతో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, క్రిష్టియన్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో

బాన్సువాడ: బాన్సువాడలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు అశేష జనవాహిని తరలి వచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. సుమారు 850 బస్సుల్లో ప్రజలను సభకు తరలించారు. బాన్సువాడ పట్టణం, వీక్లీ మార్కెట్ ప్రాంగణం గులాబీమయంగా మారాయి. వాహనాల పార్కింగ్ బేతాళస్వామి కాలనీ సమీపంలో ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ జామ్ అయింది. సభ ప్రాంగణం స్థలం సరిపోక చాలా మంది సభ బయటే నిలబడి ఉన్నారు. కళాకారులు పాడిన గేయాలకు అభిమానులతో పాటు పోచారం నృత్యం చేస్తూ జోష్ నింపారు.

సీఎం పర్యటన సాగిందిలా..

సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 2గంటల12 గంటలకు జుక్కల్‌లో హెలిక్యాప్టర్ దిగారు. ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజు సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికారు.

- 2.18 నిమిషాలకు సీఎం కేసీఆర్ సభ వేదికపైకి వచ్చారు.
- ముందుగా ఎమ్మెల్యే హన్మంత్‌సింధే మాట్లాడగా తర్వాత సీఎం కేసీఆర్ 2.20 నిమిషాలకు ప్రసంగించారు. 25 నిమిషాలు కేసీఆర్ మాట్లాడారు.
- 3 గంటల 10 నిమిషాలకు బాన్సువాడకు సీఎం చేరుకున్నారు. కేసీఆర్‌కు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పుష్పగచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.
- 3:20 నిమిషాలకు కేసీఆర్ సభాస్థలికి చేరుకోగ మైనార్టీ నాయకులు చేతికి దట్టి కట్టారు.
- 3:25 నుంచి 3:50 వరకు స్పీకర్ పోచారం ప్రసగించారు.
- 3:50 నుంచి 4:05 వరకు సీఎం కేసీఆర్ ప్రసగించారు.
- 4:15కు ప్రత్యేక బస్సులో హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న కేసీఆర్ అక్కడి నుంచి హెలిక్యాప్టర్‌లో వెళ్లిపోయారు.



బాన్సువాడ సభలో మహిళల సందడి



బాన్సువాడ సభ వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు, ప్రజలు



సీఎంకు వెంకటేశుని ప్రతిమ అందిస్తున్న స్పీకర్



పాట పాడుతున్న మధుప్రియ





బాన్సువాడలో సభ ప్రాంగణానికి తరలివస్తున్న ప్రజలు





బాన్సువాడ సభలో పల్లీలు అమ్ముతున్న మహిళ, స్నాక్స్ విక్రయిస్తున్న చిరు వ్యాపారి

బీఆర్ఎస్ నేత చంద్రశేఖర్‌రెడ్డిపై వేటు

- క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ చేసిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిపై పార్టీ అధిష్టానం వేటు వేసింది. పలుమార్లు హెచ్చరించినా ఆయన వ్యవహార శైలీలో మార్పు రాకపోవడంతో సోమవారం సస్పెండ్ చేసింది. చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ నియమావళికి విరుద్ధంగా, క్రమశిక్షణ రహితంగా వ్యవహరించినందుకు తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు కామారెడ్డి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ప్రకటన జారీ చేశారు. ఈనెల 28న పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో జరిగిన నాయకుల చేరికల కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్, సీనియర్ నాయకుడు తిర్మల్‌రెడ్డిని చంద్రశేఖర్ అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడని హైకమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ప్రభుత్వ విప్, ముఖ్య నేతల ముందే జరిగిన ఈ ఘటనపై మంత్రి కేటీఆర్‌కు, హైకమాండ్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. అలాగే నేతల్లో విభేదాలను సరిదిద్దేందుకు ఇటీవల మంత్రి కేటీఆర్ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో సైతం చంద్రశేఖర్‌రెడ్డిని తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి సుభాష్‌రెడ్డి ఆయనను సస్పెండ్ చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి కామారెడ్డి పట్టణాధ్యక్షుడిగా పని చేశారు. ప్రస్తుతం ఆయన భార్య గడ్డం ఇందుప్రియా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్‌కు కుడి భుజంలా వ్యహరిస్తున్న ఆయన సస్పెండ్ కావడం అనుచరులకు మింగుడుపడటం లేదు. కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డిలో పార్టీకి నష్టం వచ్చేలా వ్యవహరిస్తే ఎవరిని క్షమించేది లేదని నేతలు హెచ్చరించారు.

ఒకరిపై కేసు

మోపాల్: మండలంలోని మంచిప్పకు చెందిన మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ సోమవారం తెలిపారు. గ్రామస్తులు, ఎస్‌హెచ్‌వో కథనం ప్రకారం.. గ్రామాభివృద్ధి కమిటీలో ఖర్చుల విషయంలో గోవ్వురు మహేశ్, గోవ్వురు ప్రవీణ్ మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో సమావేశాన్ని అర్ధంతరంగా ముగించి బయటకు వచ్చారు. అనంతరం మాటమాట పెరగడంతో మహేశ్, ప్రవీణ్‌పై దాడి చేశారు. ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

విరోధులుగా మారిన మిత్రులు

- పదేళ్ల క్రితం టీఆర్ఎస్ విజయం కోసం ముగ్గురి కృషి
- ఈ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా జీవన్‌రెడ్డి, వినయ్‌రెడ్డి
- అనారోగ్యంతో రాజకీయాలకు దూరమైన జలంధర్‌యాదవ్



ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి



వినయ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి



నిమ్మల జలంధర్ యాదవ్

జంగ్ తెలంగాణ

ఆర్మూర్: వారు ముగ్గురు ఒకప్పుడు మంచి మిత్రులు. కానీ ఇప్పుడు విరోధులుగా మారారు. 2014 శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం కోసం పాటు పడ్డ ఈ ముగ్గురు మిత్రులు వ్యక్తిగత విభేదాల కారణంగా విడిపోయి వేర్వేరు పార్టీల్లో చేరి రాజకీయ శత్రువులుగా మారారు. ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి, నిమ్మల జలంధర్ యాదవ్ సుమారు 25 ఏళ్లుగా మిత్రులుగా కొనసాగుతున్నారు. వేల్పూర్ మండలం జాన్కంపేటకు చెందిన జీవన్‌రెడ్డి, ఆర్మూర్ మండలం కోమన్‌పల్లికి చెందిన వినయ్‌రెడ్డి, జక్రాన్‌పల్లి మండలం పడకల్‌కు చెందిన జలంధర్‌యాదవ్ హైదరాబాద్‌లో చదువుకొనే సమయంలో, వ్యాపారాలు చేసే సమయం నుంచి ముగ్గురు మిత్రులుగా ఉన్నారు. జీవన్‌రెడ్డి, వినయ్‌రెడ్డి కలిసి జేవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో రియల్ ఎస్టేట్‌తో పాటు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వ్యాపారాలు సైతం చేశారు. తమ మిత్రుడు జీవన్‌రెడ్డికి రాజకీయంగా ఎదగాలని ఉన్న ఆసక్తికి మిగతా ఇద్దరు తోడై సహాయ సహకారాలు అందించారు.

వీరు ముగ్గురు కలిసి 2013 ఏప్రిల్‌లో ఆర్మూర్‌లో నిర్వహించిన టీఆర్ఎస్ 13వ ఆవిర్భావ సభను విజయంతం చేసి కేసీఆర్ దృష్టిలో సైతం పడ్డారు. పార్టీ కార్యకర్తలుగా కొనసాగుతూ 2014 ఎన్నికల్లో జీవన్‌రెడ్డి గెలుపు కోసం అన్నీ తామై పని చేశారు. చిన్నతనం నుంచి వీరు ముగ్గురు కలిసి వేసుకున్న ప్రణాళిక ప్రకారం జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించాడు. తర్వాత రోజుల్లో వీరి మధ్య మనస్పర్థలు పెరిగిపోవడంతో విడిపోయారు. మొదట్లో వినయ్‌రెడ్డి రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలోని పలు యువజన సంఘాలను చేరదీసి వారికి సహాయ సహకారాలు అందించేవారు. జలందర్ యాదవ్ సైతం నిమ్మల ఫౌండేషన్ పేరిట సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ వచ్చారు. జీవన్‌రెడ్డితో విభేదించిన జలందర్‌యాదవ్ కల్వకుంట్ల కవిత వద్ద క్రియాశీలకంగా పని చేస్తూ జాగృతిని బలోపేతం చేయడంలో తన వంతు పాత్ర పోషించారు.

2018 ఎన్నికల సమయంలో..

2018లో టీఆర్ఎస్ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లడంతో ఈ ముగ్గురు మిత్రుల మధ్య ఉన్న విభేదాలు తారాస్థాయికి చేరాయి. జీవన్‌రెడ్డికి ఆర్మూర్ టీఆర్ఎస్ పార్టీ టికెట్ ఖరారు కావడంతో వినయ్‌రెడ్డికి బీజేపీ నుంచి అవకాశం లభించింది. మరోవైపు జలందర్ యాదవ్ జీవన్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆకుల లలిత తరఫున విస్తతంగా ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో మరోమారు జీవన్‌రెడ్డి విజయం సాధించాడు.

ప్రస్తుతం..

ప్రస్తుత 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆశన్నగారి జీవన్‌రెడ్డి రెట్టించిన ఉత్సాహంతో హ్యాట్రిక్ విజయం కోసం ప్రచారం చేస్తున్నారు. వినయ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి ఆర్మూర్ టికెట్‌ను సాధించుకొని పోటీలో నిలబడ్డారు. నిమ్మల జలందర్ యాదవ్ అనారోగ్యంతో నియోజకవర్గానికి దూరం ఉంటూ హైదరాబాద్‌కే పరిమితమయ్యాడు. ఒకప్పుడు ప్రాణ స్నేహితులుగా ఉన్న వీరు ముగ్గురు రాజకీయాల కారణంగా విరోధులుగా మారి గెలుపు, ఓటముల కోసం పంతాలకు పోవడంపై నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది.

రిటర్నింగ్ అధికారులు వీరే..

సుభాష్‌నగర్ : ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి ఉంటారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాలున్నాయి. వీరిని ఎన్నికల సంఘం నియమిస్తుంది. నామినేషన్లు స్వీకరించడంతో పాటు పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు వారిదే బాధ్యత.

జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, ఫోన్ నెంబర్లు..

నియోజకవర్గం	పేరు	హోదా	ఫోన్	నామినేషన్లు స్వీకరించే ప్రదేశం
ఆర్మూర్	టి వినోద్‌కుమార్	ఆర్డీవో	9491036110	తహసీల్దార్ కార్యాలయం
బోధన్	రాజాగౌడ్	ఆర్డీవో	9491036893	ఆర్డీవో కార్యాలయం
బాన్సువాడ	భుజంగ రావు	ఆర్డీవో	9492022593	తహసీల్దార్ కార్యాలయం
నిజామాబాద్ అర్బన్	మకరంద్	కమిషనర్	7815957047	కార్పొరేషన్ కార్యాలయం
నిజామాబాద్ రూరల్	రాజేంద్ర కుమార్	ఆర్డీవో	9491036891	పాత కార్పొరేషన్ కార్యాలయం
బాల్కొండ	చిత్రామిశ్రా	అదనపు కలెక్టర్	9491036911	భీమ్‌గల్ తహసీల్దార్ కార్యాలయం

తనిఖీల్లో నగదు స్వాధీనం



నిజామాబాద్‌లో నగదుతో పోలీసులు



కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద..

ఖలీల్‌వాడి/రెంజల్/డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి/మాక్లూర్: ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం తనిఖీల్లో భాగంగా పలుచోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్ నగరంలో రూ.11.56 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నరహరి తెలిపారు. కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద రూ.రెండు లక్షల నగదును పట్టుకున్నట్లు రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ వద్ద ఒక వ్యక్తి వద్ద రూ.రెండు లక్షలు నగదు దొరికినట్లు సీఐ కృష్ణ, ఎస్సై మహేష్ చెప్పారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్ శివారులో ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో రూ.76,800 నగదును స్వాధీనం చేసుకున్నారు. మాక్లూర్ మండలం మాదాపూర్‌లో రూ.2.5లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



సాయిలు(ఫైల్)

రాజంపేట: అనారోగ్య కారణాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తలమడ్లలో చోటు చేసుకుంది. ఎస్సై సంపత్ తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన కుమ్మరి సాయిలు (51) 20 ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. సోమవారం ఉదయం భార్య పుష్ప లేచి చూడగా పక్క గదిలో ఉరివేసుకుని ఉన్నాడు.మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

గాంధారి: గాంధారికి చెందిన కొరండ్ల రాజేశ్వర్(54)ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ సోమవారం తెలిపారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం శివారులో గల నడిమిగడ్డ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని రూరల్ ఎస్సై మహేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. చెరువులో మృతదేహం ఉందని సమాచారం అందుకున్న సీఐ వెంకటనారాయణ, ఎస్సై మహేశ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకున్నారు. నాలుగు రోజుల క్రితం చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి చేతిపై లవ్ సింబల్ పచ్చబొట్టు ఉందని అందులో పి.ఎస్.ఎస్ అనే అక్షరాలు ఉన్నట్లు ఎస్సై తెలిపారు. వయస్సు 30 నుంచి 40 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

ఖలీల్‌వాడి: నగరంలోని పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు, సీఐలు అజయ్‌బాబు, అంజయ్య ఆదివారం అర్ధరాత్రి దాడులు చేశారు. నగరంలోని నయాబ్రిడ్జి, అర్సపల్లి తోపాటు ఖిల్లాగోశాల రోడ్డు ప్రాంతాల్లో దాడులు చేసి 24 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్లు, రూ.84 వేల వరకు నగదు స్వాధీనం చేసుకున్నారు.



సబలెంకా శుభారంభం


మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6–0, 6–1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగూలా (అమెరికా) 7–5, 6–2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.



అఫ్గాన్ తీన్‌మార్...


ఫారూఖీ

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.


అజ్మతుల్లా


రహ్మత్ షా


హష్మతుల్లా

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఎంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 241. వికెట్ల పతనం:** 1–22, 2–84, 3–134, 4–139, 5–167, 6–180, 7–185, 8–230, 9–239, 10–241. **బౌలింగ్:** ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10–0–38–2, ఫజల్లఖ్ ఫారూఖీ 10–1–34–4, నవీన్ ఉల్ హక్ 6.3–0–47–0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7–0–37–1, రషీద్ ఖాన్ 10–0–50–1, నబీ 6–0–33–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మానుల్లా గుర్బాజ్ (బి) మదుషంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు) 242. వికెట్ల పతనం:** 1–0, 2–73, 3–131. **బౌలింగ్:** మదుషంక 9–0–48–2, రజిత 10–0–48–1, మాథ్యూస్ 3–0–18–0, చమీర 9.2–0–51–0, తీక్షణ 10–0–55–0, ధనంజయ డిసిల్వా 4–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ × బంగ్లాదేశ్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

అనీశ్ డబుల్ ధమాకా


కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం



మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్–2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.

లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టెటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా

కౌంట్ డౌన్ స్టార్ట్


వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

అమ్మాడీ...


● మృణాల్ ఠాకూర్, నాని

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఎ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ - అనిల్ విశ్వనాథ్



''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర–2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

మమ్మల్ని సినిమా కలిపింది - విజయ్ దేవరకొండ


● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్త వాళ్లు కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంశు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. త్వరలో మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.

ప్రేమకథ షురూ


● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.

కథని నమ్మి చేశాం - శ్రీరామ్


● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం - బ్రహ్మానందం


● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది - సుహాస్


● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీశ్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.